ప్రత్యేక చట్టాలుండాలి



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు, సిబ్బందిపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన క్రూరమృగాలను కఠినంగా శిక్షించాలి. వైద్యారోగ్య సిబ్బంది రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చి వారిలో ఆత్మస్థైర్యం నింపాలి.

– డాక్టర్ ఆర్.హరీష్, నర్రవాడ పీహెచ్‌సీ

దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి. వైద్యారోగ్య సిబ్బంది భద్రతకు ప్రత్యేక చట్టాలు అవసరం. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో రాత్రివేళల్లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా పోలీసు రక్షణ కల్పించాలి.

– పి.ప్రభావతి, సీనియర్ ఫార్మసిస్ట్, చేజర్ల పీహెచ్‌సీ

రక్షణ లేకుంటే ఎలా?



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేకుంటే ఎలా? విధులకు వెళ్లిన వారు ఎలా ఉన్నారోనని ఇంట్లో తల్లిదండ్రులు టెన్షన్ పడరా? కోల్‌కతా ఘటన వైద్యుల్లో ఒకింత భయాన్ని నెలకొల్పింది. ప్రభుత్వం కచ్చితంగా రక్షణపై ఫోకస్ పెట్టాలి. మేం ప్రశాంతంగా ఉంటేనే కదా రోగులకు సేవలందించేందుకు వీలవుతుంది.

– డాక్టర్ భారతి, మెడికల్ ఆఫీసర్ కోవూరు



క్లుప్తంగా

యూటీఎఫ్ నేతల ధర్నా



నిరసన తెలుపుతున్న నాయకులు

కోవూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కోవూరు తాలూకా ఆఫీసు ఎదుట శుక్రవారం ధర్నా జరిగింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలీ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జమీర్ అహ్మద్, సీహెచ్ మాలకొండయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, జయప్రకాష్, చెంచు సుబ్బయ్య, చేబ్రోలు వెంకటేశ్వర్లు, గౌస్‌భాషా, తాటిపర్తి వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహ పునఃప్రతిష్ట



ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం సరస్వతీదేవి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పూజలు చేశారు.

రికార్డుల పరిశీలన



వైద్యసేవల గురించి ఆరాతీస్తున్న అధికారులు

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని శుక్రవారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన టీబీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న డైట్‌పై పల్లిపాడులో నివాసాలకు వెళ్లి ఆరాతీశారు. డైట్ కళాశాల ఆవరణలో 104 ద్వారా అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.కిశోర్ కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ కోసం ఉద్యమం



మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కృష్ణపట్నంలోని అదానీ పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించి.. పదివేల మందికి ఉపాధిని కాపాడడంతోపాటు జిల్లా అభివృద్ధికి ఉద్యమాలు సాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, గోగుల శ్రీనివాసులు అన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. ఇతర పోర్టుల్లో వ్యాపార లావాదేవీల కోసం కృష్ణపట్నం, జిల్లా ప్రయోజనాలను తాకట్టు పెట్టడం సరికాదని హితవు పలికారు. ఈ విషయమై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోర్టుకు వెళ్లి పరిశీలించారని, అయితే అక్కడ ఎలాంటి మార్పులు జరగడంలేదని అసెంబ్లీలో చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీడీపీ ఈ విషయంలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కంటైనర్ టెర్మినల్‌ను సాధించేంత వరకూ సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. నేతలు గడ్డం అంకయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లూరు(క్రైమ్): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయం, గెస్ట్ హౌస్, క్యాంప్ ఆఫీస్‌లో మొక్కలను ఎస్పీ శుక్రవారం నాటారు. అదే విధంగా ఆయన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు 500 మొక్కలు నాటారు. ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, ఆర్ఐలు అంకమరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లేక.. పని దొరక్క!

ఇసుక ఉచితం చేశాం. ప్రజలకు అందుబాటులో ఉంచాం. అందరూ తీసుకెళ్లి పనులు చేసుకుంటున్నారు. ఇది కూటమి ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా చెబుతున్న మాట. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. తెలుగు తమ్ముళ్లకు మాత్రమే ఇసుక లభ్యమవుతోంది. సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. దీంతో భవన నిర్మాణాలు ఆగిపోయి కార్మికులు పూట గడవక ఇబ్బంది పడుతున్నారు.

- టీడీపీ నాయకులు చెప్పిన వారికే పంపిణీ
- పేరుకే ఉచితం.. కానీ ప్రజలకు చాలా దూరం
- ట్రాక్టర్ వెళ్తే ఖాళీగా వెనక్కి పంపేస్తున్న వైనం
- ఆగిపోయిన నిర్మాణాలు.. కార్మికుల అవస్థలు



ర్యాలీలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

కోవూరు: కూటమి ప్రభుత్వం ఇసుకను ప్రజలకు దూరం చేసింది. తెలుగు తమ్ముళ్లు దానితో అక్రమంగా వ్యాపారం చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. వైఎస్సార్‌సీపీ సర్కార్ ఎంతో ముందుచూపుతో ఇసుక నిల్వ చేసి అవసరమైన వారికి అందేలా చర్యలు తీసుకుంది. ఆ స్టాక్ పాయింట్లను అవినీతి కొండలంటూ అసత్య ప్రచారం చేసిన టీడీపీ నాయకులు అధికారంలోకి రాగానే అక్రమ రవాణాకు తెరతీశారు.

నేతల కనుసన్నల్లో..

టీడీపీ నేతల కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. ఇటీవల కొడవలూరు పోలీసులు రెండు టిప్పర్లను పట్టుకున్నారు. కూటమి నాయకుల ఒత్తిళ్లతో అధికారులు పాత స్టాక్ రికార్డుల జోలికి వెళ్లకుండా ఉన్న స్టాక్‌ను ప్రకటించి చేతులు దులుపుకొన్నారు. పేరుకు ఉచితమే అయినా రవాణా, కూలీలు, వెయిటింగ్ చార్జీలు తదితర రూపాల్లో గతంతో పోలిస్తే 20 టన్నుల లారీకి నేడు రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు దూరాన్ని బట్టి వినియోగదారులపై అదనపు భారం పడుతోంది.

వారికే ప్రాధాన్యం

నియోజకవర్గంలోని రెండు రీచ్‌లపై ఒత్తిడి అధికంగా ఉంది. టీడీపీ నాయకుల సిఫార్సు ఉన్న వారి మాత్రమే ఇసుక దొరుకుతోంది. బయటి వారికి లభ్యం కావడం లేదు. ట్రాక్టర్లు వెళ్తే ఖాళీగానే తిరిగొస్తున్నాయి. నేతలు చెబితే లోడింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. ఇతర జిల్లాల లారీలు లోడింగ్ కోసం రెండు, మూడు రోజులపైనే వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో బాడుగ పెరిగిపోతుంది. నియోజకవర్గంలో లారీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు కలిపి రెండువేలకు పైనే ఉన్నాయి. వీటిలో 90 శాతం పైగా ఖాళీగా ఉంటున్నాయని యూనియన్ నాయకులు అంటున్నారు.



పల్లిపాడు రీచ్‌లో బారులు తీరిన ఇసుక లారీలు

ఇసుక కొరత ప్రభావంతో..

ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఈ రంగంపై ఆధారపడి సుమారు 5 వేల మందికి పైగా జీవిస్తున్నారు. అధిక ధర వెచ్చించి ఇసుక కొనుగోలు చేయలేక సామాన్య, మధ్య తరగతి వారు నిర్మాణ పనులు ఆపేయడంతో కార్మికులకు ఉపాధి కరువైంది. దీంతో అనేకమంది పనుల కోసం తెలంగాణ, కర్ణాటక, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.



నిర్మాణం ఆగిపోయిన ఈ ఇల్లు మండల కేంద్రమైన విడవలూరు దళితవాడలోనిది. దీని పనిని కొన్ని నెలల క్రితం చేపట్టారు. ప్రస్తుతం ఇసుక కొరత కారణంగా ఆపేశారు.

నియోజకవర్గంలో రీచ్‌లు : పల్లిపాడు (ఇందుకూరుపేట), మినగల్లు (బుచ్చిరెడ్డిపాళెం)

కార్మికుల ధర్నా

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇసుకను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఇసుక విధానానికి వ్యతిరేకంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి మాట్లాడారు. ఇసుక దొరక్కపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నూతన ఇసుక విధానం తీసుకొచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇసుక అందుబాటులోకి తీసుకురాకపోతే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఇంటి నిర్మాణం నిలిచిపోయింది



ఇసుక దొరక్కపోవడంతో రెండు నెలలుగా ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గతంలో ఆరు యూనిట్ల లారీ ధర రూ.16 వేల వరకు ఉంటే ఇప్పుడు ఇంకా ఎక్కువగానే చెబుతున్నారు. అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ధర తగ్గాక పని చేయించుకుందామని ప్రస్తుతానికి నిలిపివేశాం.

– అవినాష్, భవన యజమాని

పనుల్లేవు



ఇసుక లేని కారణంగా ఎంతో మంది భవన నిర్మాణ కార్మికులు వలసలు వెళ్లిపోతున్నారు. ఇసుక లభ్యత తగ్గిపోవడంతో చాలామంది ఇంటి యజమానులు పనులను ఆపేస్తుండడంతో పనుల్లేక ఇబ్బంది పడుతున్నాం. కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించి మాలాంటి కార్మికులను ఆదుకోవాలి.

– సురేష్, తాపీ మేస్త్రి

బెంగళూరు వెళ్లి పనిచేస్తున్నా



ఇసుక కొరత కారణంగా ఇక్కడ భవన నిర్మాణం పనులు నిలిచిపోయాయి. కుటుంబం పోషణ కోసం బెంగళూరు వెళ్లి పనిచేస్తున్నాను. కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందించాలి. అప్పుడే మాలాంటి కార్మికులకు పని దొరుకుతుంది.

– కోటేశ్వరరావు, పడుగుపాడు

ఖాళీగా లారీలు

ఇసుక కొరత కారణంగా లారీలు, టిప్పర్లు ఖాళీగా ఉంటున్నాయి. వాటిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయి.

– నారాయణ లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు

ఉచిత నేత్ర వైద్య శిబిరం రేపు

విడవలూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మన సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన సేవా సంస్థ, రెడ్‌క్రాస్ విడవలూరు ఆధ్వర్యంలో నెల్లూరు మోడ్రన్ ఐ హాస్పిటల్ సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెం గ్రామంలో శుక్రవారం విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం జరిగింది. ఇందులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని మాట్లాడారు. అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి వద్ద శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన మునిరత్నం పని నిమిత్తం బైక్‌పై నిడిగుంటపాళేనికి వెళ్తుండగా గొలగమూడి సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మునిరత్నం గాయపడగా స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలం పాట నేడు

తోటపల్లిగూడూరు: నెల్లూరు నవాబుపేటలో కొలువుదీరిన మల్లేశ్వరస్వామి భూములకు శనివారం కౌలు వేలం పాట జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గుడికి సంబంధించి మండలంలోని చిన్నచెరుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో 95.22 ఎకరాల మాగాణి భూమి ఉందన్నారు. భూమిని ఆరు భాగాలుగా విభజించి మూడేళ్ల కాలపరిమితికి శనివారం చిన్నచెరుకూరు గ్రామ సచివాలయంలో వేలం పాట నిర్వహిస్తామని వెల్లడించారు.

బీజేపీ బలోపేతానికి కృషి

వెంకటాచలం: బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కండ్రిగ ఉమ పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని మా పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నేతలు కుంచి శ్రీనివాసులు యాదవ్, ఆలూరు ప్రసాద్ నాయుడు, హసనాపురం శ్రీనివాసులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: మాట్లాడుతున్న నాయకులు

➡ **పొదలకూరు:** ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త 50 నుంచి 100 మంది సభ్యత్వాలను చేయించాలని బీజేపీ మండలాధ్యక్షుడు ముక్కు అయోధ్య రామయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎం.రవీంద్రబాబు, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, ఎం.పెంచలయ్య, ఏడుకొండలు, పెంచల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే తెలియజేయాలి

కొడవలూరు: రాజ్యాంగ పరంగా కల్పించిన హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని గిరిజనులకు అధికారులు సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.స్ఫూర్తి మాట్లాడుతూ గిరిజనుల పట్ల వివక్ష చూపడం చట్ట రీత్యా నేరమన్నారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డులు పొందడంలో సమస్యలుంటే చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంతకుమారి, సర్పంచ్ కాకి ధనమ్మ, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, నాయకులు డేగా దయాకర్‌రెడ్డి, కాకి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



మనుబోలు: ధాన్యలక్ష్మి అలంకరణలో..



పొదలకూరు: కుంకుమార్చన పూజలు

పొదలకూరు: శ్రావణమాసం చివరి శుక్రవారం స్థానిక శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

➡ **ఇందుకూరుపేట:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నం శ్రీచాముండేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు ఉదయగిరి వెంకట శేషాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు.

➡ **మనుబోలు:** మండల కేంద్రమైన మనుబోలు విష్ణాలయంలో శుక్రవారం అర్చకులు హనుమాచార్యులు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ధాన్యలక్ష్మి అలంకారం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



మనుబోలు: మండలంలోని మనుబోలు, పిడూరు, ఎల్ఎన్‌పురం, కాగితాలపూరు, బండేపల్లి, జట్ల కొండూరు, బద్దెవోలు, పిడూరుపాళెం, కట్టువపల్లి తదితర గ్రామాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను విజిలెన్స్ డీఈ కె.మహిత, ఏఈ అవినాష్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోటుపాట్లకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. వారి వెంట హౌసింగ్ ఏఈ రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శరత్, శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నబియా ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



మనుబోలు: మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో వీఆర్ఏ వల్లం రమేష్ తన కుమారుడు చింటూ జ్ఞాపకార్థం శుక్రవారం వినాయకుని విగ్రహాన్ని అందించారు. అర్చకులు కోటేశ్వరరావు, శివకుమార్‌శర్మ, శ్రీనివాసరావు వివిధ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

అరియర్స్ చెల్లించాలంటూ నిరసన



నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగులకు అన్ని రకాల అరియర్స్‌ను వెంటనే చెల్లించాలంటూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసనను శుక్రవారం చేపట్టారు. వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఎస్ రెడ్డి, జోనల్ కార్యదర్శి లూక్సన్, జిల్లా చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, ఒకటో, రెండో డిపోల కార్యదర్శులు చెంచయ్య, సునీల్, ఉదయ్‌శంకర్, డీఎంకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వన మహోత్సవం

విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ బి.సుజాత ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం జరిగింది. మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత ఆమె తెలియజేశారు. కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

➡ **కోవూరు:** స్థానిక మండల కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మొక్కలు నాటారు. అనంతరం బాలికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. బాలికల హాస్టల్, స్కూల్ వద్ద ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాన్ని త్వరగా చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి శివరామకృష్ణ, జెడ్పీ సీఈఓ కన్నమ నాయుడు, కోవూరు ఎంపీడీఓ శ్రీహరి, ఎంపీపీ తుమ్మల పార్వతి, కోవూరు సర్పంచ్ యాకసిరి విజయ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

వెంకన్నపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు: మండలంలోని వెంకన్నపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్ఎం రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ పెమ్మారెడ్డిపాళెంలో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డి.జనార్దన్ పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్ఎం అనిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకన్నపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఈ–క్రాప్‌లో వివరాల నమోదు తప్పనిసరి

- జేడీఏ విజయభారతి

కోవూరు: రైతులు ఈ–క్రాప్‌లో వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించాలని గుంటూరు కమిషనర్ కార్యాలయం జేడీఏ విజయభారతి అన్నారు. మండలంలోని ఇనమడుగు శుక్రవారం గ్రామంలో ఆమె పర్యటించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా వివరాల నమోదు ప్రక్రియ చేపట్టారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తాము పండించిన పంటలు నష్టపోతే ప్రభుత్వం సాయం అందించేందుకు వీలుంటుందన్నారు. అలాగే ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశముందన్నారు. ఎరువులు, పురుగు మందులు, ఎంత మేరకు అవసరం అవుతాయో ఆర్బీకేలకు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీ సుజాత, ఏఓ ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేద్దాం

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామమని, దీన్ని విజయవంతం చేద్దామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడారు.